క్లుప్తంగా

ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ



మధురానగర్ స్కూల్‌లో ప్రోగ్రెస్ కార్డులతో విద్యార్థులు, తల్లులు

సీతంపేట: మధురానగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. 6, 7, 8, 9 తరగతులకు వార్షిక పరీక్షలు ముగియడంతో పరీక్ష పత్రాలు దిద్ది విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కులను, హాజరు శాతాన్ని ప్రోగ్రెస్ కార్డులో పొందుపర్చారు. పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశామని, 372 మందికి అవి ఇచ్చినట్టు హెచ్‌ఎం శాంతి కుమారి తెలిపారు. విద్యార్థులంతా తదుపరి తరగతులకు ప్రమోట్ అయినట్టు చెప్పారు. జూన్ 12న ప్రారంభమయ్యే నూతన విద్యా సంవత్సరం రోజున విద్యార్థులకు విద్యా కానుక కింద పుస్తకాలు, బ్యాగ్, షూష్ అందిస్తామన్నారు. 9 తరగతి విద్యార్థులకు ట్యాబ్ కంటెంట్ ఇచ్చామని, వేసవి సెలవుల్లో దానిని చదివేలా ఉపాధ్యాయులు గైడ్ చేశామని హెచ్‌ఎం పేర్కొన్నారు.

యువతి అదృశ్యం



మొయ్యి లిఖిత

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా. మురళీనగర్ తెన్నేటి నగర్‌కు చెందిన మొయ్యి లిఖిత ఈ నెల 27 నుంచి కనిపించడం లేదు. పీఎం పాలెం సాంకేతిక విద్యా పరిషత్‌లో బీ-టెక్ చదువుతోంది. రోజూ మాదిరిగానే ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం కాలేజీకి వెళ్లింది. రాత్రి 8 గంటలు అయిన ఇంటికి రాకపోవడంతో, ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. చుట్టుపక్కల, బంధువులు, మిత్రులను కుటుంబ సభ్యులు సంప్రదించినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానం వచ్చి ఇంట్లో చూడగా.. 5 తులాల బంగారం, రూ.35 వేలు నగదు కూడా కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి మొయ్యి రాజేంద్రనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.


గంజాయి రవాణా నిందితులకు రిమాండ్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా 12 కిలోల గంజాయిని తరలిస్తున్న తమిళనాడుకు చెందిన యువకులు ఎస్కిపాండ్యన్, ఆరవింత్‌ను ద్వారకా జోన్ సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర అదుపులోకి తీసుకుని విచారించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల అదుపులో ఆకతాయిలు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధి ద్వారకానగర్‌లోని సుబ్బయ్య హోటల్ దరి కొంత మంది ఆకతాయిలు చేరి దారిన పోయేవారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ సమాచారంతో ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆకతాయిల వివరాలు సేకరిస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్ వద్ద బీజేపీ చలివేంద్రం ఏర్పాటు చేసింది. దీనిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణు కుమార్‌రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సురేష్‌బాబు, జిల్లా సెక్రటరీ కొప్పిశెట్టి శంకరరావు, కోరాడ వెంకటరమణ, వీరుబాబు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

పోలీస్ స్టేషన్‌లోకి పోయే దారేది..!

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో ఫిర్యాదుదారులతోపాటు పోలీస్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దొంగతనం కేసుల్లో తీసుకొచ్చిన ద్విచక్ర వాహనాలను ప్రవేశ మార్గం వద్ద అడ్డంగా పార్క్ చేసి వదిలేయడంతో ఈ సమస్య నెలకొంది. స్టేషన్‌లోకి, దాని నుంచి బయటకు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీస్ అధికారులు స్పందించి స్టేషన్ వద్ద ఇబ్బందులు లేకుండా చూడాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.



ద్వారకా స్టేషన్‌కు అడ్డంగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

రోడ్డెక్కిన మురుగు, వ్యర్థాలు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట రెల్లి వీధి వద్ద డ్రెయిన్ తరచూ పొంగి ప్రవహిస్తోంది. కాలువ కల్వర్టు వద్ద చెత్తాచెదారం నిలిచిపోవడంతో మురుగు నీరు, వ్యర్థాలు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నాయి. డ్రెయిన్ కల్వర్టులో అడ్డంకులు ఉన్నట్టు తెలుస్తోంది. రాకపోకల సమయంలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



సీతంపేట రెల్లి వీధి డ్రెయిన్‌లో నిలిచిపోయిన వ్యర్థాలు

కంపుకొడుతున్న మరుగుదొడ్లు



ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌లో అధ్వానంగా మరుగుదొడ్డి

సీతమ్మధార: స్థానిక ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే ఫిర్యాదుదారులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్టేషన్‌కు ఒకటే మరుగుదొడ్డి ఉండటంతో సిబ్బందితో పాటు ఫిర్యాదుదారులు, నిందితులు దాన్నే వినియోగిస్తున్నారు. దీంతో స్టేషన్ వద్ద శుభ్రత కరువై మరుగుదొడ్డి ఎప్పుడూ కంపుకొడుతోంది. స్టేషన్ అధికారి స్పందించి దుర్వాసన రాకుండా అధ్వానంగా ఉన్న టాయిలెట్‌ను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

మండు వేసవిలో చల్లచల్లగా..



బాలయ్యశాస్త్రి లేవుట్‌లో కొబ్బరి బొండాం నీరు తాగుతున్న పాదచారులు



నక్కవానిపాలెంలో చెరుకు రసం తాగుతున్న యువకులు

- జనం చూపు.. శీతల పానీయాల వైపు

సీతమ్మధార: ఈ వేసవి నిప్పుల కుంపటిలా మండుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. మండు వేసవిలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాల దుకాణాల వైపు పరుగులు పెడుతున్నారు. దీంతో కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్, కొబ్బరి బొండాలు, చెరుకు రసం దుకాణాలన్నీ బిజీగా మారాయి. శీతల పానీయాల షాపుల వద్ద ప్రజలు చేరి దాహార్తిని తీర్చుకుంటున్నారు. వేసవి మొదలు చల్లని వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, అల్లూరి జంక్షన్, రైతుబజార్ ఏరియా తదితర ప్రాంతాల్లోని శీతల పానీయాల దుకాణాల వద్ద జనం ఎక్కువగా కనిపిస్తున్నారు.

విజ్ఞానం పెంపొందించుకోవాలి

అల్లిపురం: బంగారుమెట్ట శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి చక్కటి పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ నెల 8 నుంచి జూన్ 16 వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కథలు వినడం, పుస్తకాలు చదవడం, చదివిన పుస్తకంపై సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్స్, డ్యాన్స్, డ్రామా, బొమ్మలు తయారు చేయడం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. చిన్నారులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిగా నడుచుకోండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా మంచిగా జీవించాలని సూచించారు. ఎటువంటి తగాదాలు, గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ఉంటున్నారా.. లేదా, వారి దినచర్య తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని సన్మార్గంలో నడుచుకోవాలని రౌడీ షీటర్లకు సీఐ సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీ షీటర్లను వారి ఇంటి వద్ద అప్పగించి పోలీస్ కానిస్టేబుళ్లు వచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్త్ టౌన్ పీఎస్‌లో..

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ చేశారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు.

గుండెపోటుపై అప్రమత్తత అవసరం

మురళీనగర్: గుండెపోటు ప్రమాదాలను నివారించేందుకు 40 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా ఆరు నెలలకోసారి కాల్షియం స్కోరింగ్ టెస్ట్ చేయించుకుని వైద్యుల సలహా ప్రకారం మందులు వాడాలని కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్, ఎస్ఆర్ఐ ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని ఆరోగ్య సలహాలు అందించారు. ప్రతిరోజు కనీసం 20 నిమిషాలు నడవాలని, కనీస వ్యాయామం చేయాలని, బయట జంక్ ఫుడ్ తినడం మానుకోవాలన్నారు. గ్యాస్ట్రిక్, గుండెలో నెప్పి, భుజం నెప్పి, ఆయాసం ఎక్కువగా ఉంటే తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించం ద్వారా గుండెపోటు ప్రమాదాల నుంచి బయటపడవచ్చని వివరించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఫిజీషియన్ పి.ప్రసాద్‌లు 182 మందికి బీపీ, సుగర్‌తోపాటు ఈసీజీ, 2డీ ఎకో వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 32 మందికి ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో ఉచిత పరీక్షలకు కార్డులు అందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్.వెంకటసుధాకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, కోశాధికారి జె.కూర్మారావు, జాలి వాకర్ ఎన్.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామ కృష్ణ, కార్యవర్గ సభ్యులు వైద్య శిబిరం నిర్వహణకు సహకరించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

సెలవుల్లో 'వుయ్ లవ్ రీడింగ్'

సీతంపేట: ప్రస్తుత విద్యా సంవత్సరం ఆదివారంతో ముగిసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చారు. మళ్లీ జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ 42 రోజులు విద్యార్థులు ఆటపాటల్లో నిమగ్నమవుతారు. ఆటపాటలతోపాటు విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతేడాది అమలు చేసిన 'వుయ్ లవ్ రీడింగ్' కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా అమలు చేస్తున్నారు. పాఠశాల లైబ్రరీ నుంచి విద్యార్థులు ఒక్కొక్కరికీ ఒక్కో పుస్తకాన్ని అందజేశారు. తెలుగు, ఇంగ్లిష్ స్టోరీ బుక్స్, జనరల్ నాలెడ్జి, సైన్స్, చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధులు, సైంటిస్టుల జీవిత చరిత్ర వంటి పుస్తకాలు వాటిలో ఉన్నాయి. తీసుకున్న బుక్‌ను వారం రోజుల్లో చదివి దానిపై ఒపీనియన్, రివ్యూ రాయాలి. చదవడం పూర్తయ్యాక దగ్గరగా ఉన్న విద్యార్థులతో పుస్తకాన్ని మార్చుకుని మరొకటి చదవాలి. వేసవి సెలవులు పూర్తయ్యేలోగా వీలైనన్నీ పుస్తకాలు చదివేలా ఉపాధ్యాయులు ఏర్పాటు చేశారు. సెలవుల అనంతరం పిల్లలు చదివిన పుస్తకాలపై పోటీలు నిర్వహిస్తామనిని మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి తెలిపారు.



పాఠశాల లైబ్రరీ నుంచి పుస్తకాలు తీసుకుంటున్న విద్యార్థులు

వయోవృద్ధులకు సాయపడండి

సీతంపేట: కుటుంబ ఆదరణ లేని వయోవృద్ధులకు సాయపడాలని రిటైర్డ్ కల్నల్ సుబ్బారావు పిలుపునిచ్చారు. వింటేజ్ విశాఖ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎ.హైమావతి, జి.మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఫోరం సమావేశం నిర్వహించారు. పలువురు సీనియర్ సిటిజన్లు తమ అభిప్రాయాలు, ఆలోచనలు సభకు తెలియపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 17 శాతం సీనియర్ సిటిజన్లు ఉన్నారని, వారికి అవసరమైన డే కేర్ సెంటర్లు, రిక్రియేషన్, వెల్ఫేర్ కోసం అడిగే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇది కావాలని ప్రభుత్వాన్ని, అధికారులను అడిగేందుకు ముందుకు రావడం లేదన్నారు. సీనియర్ సిటిజన్లు తాము నివసించే ప్రాంతంలో ఉన్న వయోవృద్ధులతో ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసి జిల్లా సంఘానికి అనుబంధం చేసుకుంటే బలం పెరుగుతుందని సూచించారు. మానసిక బాధలో ఉన్న వయోవృద్ధులకు తాము ఉన్నామని చేయి సాయంగా అందివ్వాలని సుబ్బారావు కోరారు. కార్యక్రమంలో ఫోరం కోశాధికారి డాక్టర్ మురళీరాజ్, ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ కల్నల్ సుబ్బారావు

వేసవి శిబిరాలతో వికాసం

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌లో వేసవి శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆసరా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞానం, వినోదం అందించేలా శిక్షణ శిబిరాలు దోహదపడుతున్నాయన్నారు. వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ వ్యవస్థాపరాలు డాక్టర్. రమాప్రభ మాట్లాడుతూ ప్రతి ఏడాది వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమానికి ఆసరా సహకారాన్ని అందిస్తోందన్నారు. సమ్మర్‌లో 15 రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో భీమిలి, మధురవాడ, ఆరిలోవ, మద్దిలపాలెం ప్రాంతాల నుంచి 90 మంది హాజరయ్యారన్నారు. శిక్షణ అనంతరం 40 ప్రాంతాల్లో వేసవి శిబిరాలను పిల్లలే నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 20 వరకు కొనసాగుతుందన్నారు.

నేడు వైభవుడి కల్యాణోత్సవం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమవుతాయి. ఆలయం నిర్మించి 21 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 5 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. త్రయాహ్నిక దీక్షతో పాంచరాత్రగమ విధానంలో ఉత్సవాలు జరుగుతాయి. సోమవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విత్వరుణ, రక్షాసూత్ర బంధన, మృత్యంగ్రహణం, అంకురార్పణ, పతాక ప్రతిష్ఠ, విశేష హోమాలు, మహానివేదన, మంగళాశాసనం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఎదురు సన్నాహోత్సవం, అనంతరం 6 గంటలకు శ్రీనివాసుడి కల్యాణం జరుగుతుంది.

తొలగించిన పాఠ్యాంశాలు పునరుద్ధరించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చి అండ్ ట్రైనింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) సంస్థ ఏకపక్షంగా 10, 12 తరగతుల పుస్తకాల నుంచి ముఖ్య పాఠ్యాంశాలను తొలగించిన నేపథ్యంలో ఈ అంశంపై ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సౌత్ ఇండియన్ ఎలయన్స్ ఫర్ ఫండమెంటల్ రైట్ టు ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఆచార్య ఎస్.రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, సంస్థ కన్వీనర్ నరవ ప్రకాశరావు, ప్రేమ సురేష్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు శేషగిరిరావు, గోపాలరావు తదితరులు మాట్లాడారు. నూతన విద్యా విధానం పేరుతో సిలబస్ నుంచి తొలగించిన డార్విన్ సిద్ధాంతం, మహాత్మా గాంధీ హత్య, మొఘల్ చక్రవర్తుల చరిత్ర, గుజరాత్ అల్లర్లు, ఆర్ఎస్ఎస్ నిషేధం పాఠాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. చరిత్రను వక్రీకరించడం గర్హనీయమని, ప్రభుత్వాలు మారినపుడు సిలబస్ మార్చడం సరికాదన్నారు. ఈ పాఠ్యాంశాల మార్పు 18 రాష్ట్రాల్లోని సుమారు 5 కోట్ల మంది విద్యార్థులపై ప్రభావం చూపుతుందన్నారు. సమైక్య విద్యా విధానం అవసరమని, విద్య రాష్ట్ర అంశం కానీ, కేంద్ర ప్రభుత్వం బలవంతగా రాష్ట్రాలపై రుద్దుతున్న వైనం ఆక్షేపణీయమన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీలకు సముచిత స్థానం కల్పించాలని, కరిక్యులమ్ స్టీరింగ్ కమిటీలో రాష్ట్రాలకు స్థానం కల్పించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ గణేష్‌నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 2న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఆపరేషన్స్ ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు గణేష్ సేవా సంఘం, గణేష్‌నగర్, రైతుబజార్, నరసింహనగర్, కిరణ్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- తాటిచెట్లపాలెం సెక్షన్ పరిధి 33/11 కేవీ తాటిచెట్లపాలెం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-1 ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తాటిచెట్లపాలెం మెయిన్ రోడ్, పరదేశమ్మ గుడి ప్రాంతం, నాగేశ్వర గ్యాస్ ఏజెన్సీ ప్రాంతం, రైల్వే న్యూకాలనీ, సంతోషిమాత గుడి వీధి, వెంకటేశ్వర కాలనీ, రామాలయం వీధి, నీలకంఠేశ్వర స్వామి గుడి రోడ్, సుబ్బలక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

వ్యక్తి ఉన్నతికి విద్య దోహదం



ఆచార్య వెలమల సిమ్మన్నను సత్కరిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: వ్యక్తి ఉన్నతికి విద్య దోహదపడుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యుడు వెలమల సిమ్మన్న అన్నారు. దూరవిద్య కేంద్రంలో ఆదివారం దూరవిద్యలో ఎంఏ తెలుగు అభ్యసిస్తున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్య వారసత్వంగా లభించే సంపద కాదని, ఎవరికి వారే సంపాదించుకోవాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల జీవితాలు వీటిని ఉదాహరణలన్నారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ తమ స్వశక్తితో వీరు జ్ఞానసముపార్జన చేసి దేశం గర్వించే స్థానాలను అధిరోహించారన్నారు. మనుషుల మధ్య దూరాన్ని చెరిపేసి, సమానత్వాన్ని సాధింపచేసేది విద్య మాత్రమేనన్నారు. కార్యక్రమానికి తెలుగు ఆచార్యులు డా.బూసి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. తమకు పాఠాలు బోధించిన గురువులను దూరవిద్యాకేంద్ర విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు చార్యులు డాక్టర్ పెండ్యాల లావణ్య, డాక్టర్ యల్. గిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.